# అబద్ధం

"పన్నెండేండ్లుగా యీ వూర్లో ప్లంబరుగా పనిచేస్తావుండాను. నా సర్వీసులో యింతవరకూ యే యింటి వోనరుతో గూడా రంపుకు పోలేదు. మూడో మనిషనేవాడు యీపొద్దు దాంకా నా వంకకు చెయ్యెత్తి చూపించలేదు. నా యింట్లో మనిషనుకున్నోడే నాకింద గుంతలోడినాడు. యిప్పుడు యీధిలోవుండే మనుషులొచ్చి మాకు మద్దిస్తం చెయ్యాల్సొచ్చింది. కడాకు నా పక్కన నిలబడే దానికి సొంతం మనిషనేవాడేలేకుండా బొయినాడు. తోడుగావుండేదానికే నిన్నీపొద్దు రమ్మని పిలుచుండేది.." పొంగుకొస్తున్న కోపాన్ని బలవంతంగా అణచుకోడానికి ప్రయత్నిస్తున్నా, నంబి గొంతు యినపడబ్బాలా టంగుటంగుమని మోగుతోంది.

"నీమాటెవుడు నమ్మతాడు! నువ్వు నోరు తెరిస్తే అబద్ధాలే! పనిజరిగేతావులో నేనుండకుండా చూడాలనే నన్ను రమ్మని పొగబెట్టుంటావు..." అన్నాడు పందరి వీధి పక్కనున్న వరండా హోటలు లోపలికి అడుగుపెడుతూ.

"నీకు యేంది అబద్ధమో, యేది మాటకారితనమో తెలవుదు! యీ పొద్దు యిక్కడ పెద్ద మద్దిస్తం జరగబోతా వుండాది. నాదెబ్బంటే యేందో నీకీపొద్దు తెలిస్తిందిలే! వూర్లోవుండే పెద్ద పెద్ద తలకాయిలంతా యింకొంచేపుట్లో యీతావుకే రాబోతా వుండారు...." అన్నాడు నంబి.

"నీకూ మద్దిస్తాలకూ వొకదండం! రావల్సినదానికంటే జాస్తీగా దుడ్డు వసూలుజేసుకునేదీ, యిండ్ల వోనర్లతో రంపులుబెట్టుకునేదీ, వాళ్ళతో మద్దిస్తాలు బెట్టుకునేదీ నీకు వాడికయిపొయ్యింది. నేను యేమారినానంటే ఆ మస్టరు దుడ్లు నేనే యెత్తుకోని బొయినానని చెప్పినా చెప్పేస్తావు..." పందరి ముఖం ముడుచుకున్నాడు.

"ఛత్ ... నాతో మద్దిస్తానికి రమ్మనిజెప్పిన యింటి వోనరెవడో నాకు జూపించు ... యీ మద్దిస్తం వేరేదిలే! సమత్సరాలుగా నాయింట్లోజేరి పందికొక్కు మాదిరిగా నాసొత్తే తినేసిపొయినాడే ఆ దగుల్బాజీగాన్ని యీపొద్దు వూరికే యిడిసిపెట్టేదిలేదు..." మళ్లీ నంబి టీ హోటలాయినవైపుకు తిరిగి అరిచాడు.

"వానితో యింక మద్దిస్తమేముండాది?" పందరిపెదవులు చప్పరించేశాడు. "వానిపెండ్లి. వానిష్టం. యీ దినాల్లో కడుపులోపుట్టిన బిడ్డలే తల్లీదండ్రీ మాటినాటంలేదు. వాడు నీ పెండ్లానికి తమ్ముడైనంతమాత్రాన నీ మాటింటాడనుకునింది నీతప్పు. మద్దిస్తం బెడితే మాత్రం జరిగిపోయిన పెండ్లిని కాదన్లేవుగదా!... నీచెల్లిని వానికిచ్చి పెండ్లి చెయ్యలేవుగదా!..."

"తూ! వానట్లాంటోడుకావాలంటే మాత్రం నాచెల్లినిచ్చి పెండ్లిచేస్తానా బాంచెత్..." నంబి పుక్రోషంతో మీసం మెలేశాడు "వానబ్బట్లాంటి సంబంధం తేకపోతే అప్పుడడుగు. కానీ వాన్నిమాత్రం వూరికేయిడవను. వాడునాయింట్లో తిన్నసొత్తు కక్కేతీరాల్ల... యిప్పుడు రాబోతావుండే పెద్ద మనుషులముందర వాన్ని కడిగిపారేయ్యాల్సిందే!"

బెంచీపైన దిట్టంగా పద్మాసనమేసుకుని పూజచేస్తున్నట్టుగా కూర్చున్న నల్లటి నంబికేసి సాలోచనగా చూస్తూ" సర్లే! ముందుగా నాకు టీ చెప్పు" అన్నాడు పండరి.

నంబి అతడికేసి వురిమిచూసి "గురువుకు శిష్యుడు టీ దీసిచ్చేదే విధాయికం" అన్నాడు.

"నువ్వు ప్లంబరు. నేను యెలక్ట్రీషియను. నువ్వునాకు గురవెట్లయినావు?" అంటూ నంబికేసి చికిలిచూపులు చూశాడు పండరి. తరువాత టీ బైలరుముందునిల్చున్న ముసలాయనకేసి తిరిగి "చూడు హోటలాయినా! యీ మనిషి ప్లంబరుపనీ, యెలక్ట్రిక్ పనీ రెండు చేసేదొచ్చునని అబద్ధంజెప్పి క్రిష్ణానగరంలో యిల్లొప్పించుకున్నాడు. నన్ను అసిస్టెంటనిజెప్పి పన్లోకి దూర్చేసినాడు. అందుకని మొత్తంగా నన్ను శిష్యుడని తేల్చేస్తావుండాడు. యిదేంన్యాయం చెప్పు?" అని అడిగాడు.

రంగులు వెలిసిపోయిన పాతవరండాలోపల, సిమెంటుతో కట్టిన చప్టాపైన, టీ బైలరు నీరసంగా పొగలు విడుస్తోంది. దానిముందొక ముసలాయిన నిల్చుని వున్నాడు. పైకెత్తి కట్టుకున్న నాలుగుమూర్ల పంచెకింద అతని కాళ్ళు యెండుకట్టెల్లా వూగుతున్నాయి. అతను తొడుక్కున్న మురికి బనీనులోంచీ అతడి యెదరొమ్మూ, వీపూ బీటలువారిన చెరువు నేలలా దిగాలుగా కనబడుతోంది. పైన తలవెంట్రుకలూ, కింద యేపుగా పెరిగిన గడ్డమూ యెక్కువభాగం ఆక్రమించుకోగా మిగిలిన కాస్త స్థలంలో కళ్ళురెండూ పాతదీగుళ్ళలో వెలిగే నూనెదీపాల్లా మినికుమినుకు మంటున్నాయి.

పెచ్చులూడిపోయిన వరండా గోడపైన, మసిబారిన పోటోలో కూర్చుని పరవశంగా నవ్వుతున్న వ్యక్తులు గాంధీ నెహ్రూలన్న సంగతి యెంతకూ తెలియరావడంలేదు. దానికింద చీలకు వేలాడుతున్న కాలెండర్లో వెంకటేశ్వరుడూ, పద్మావతీ నిర్లిప్తంగా నవ్వుకుంటున్నారు.

పండరి పలకరిస్తున్నా వులకని టీ హోటలాయినకేసి కొరకొరాచూశాడు నంబి. తరువాత పండరికేసి తిరిగి"నిన్ను రమ్మనింది నాకు న్యాయం చెప్పమని ... నీకు న్యాయం అడగమనిగాదు" అని కసిరాడు నంబి.

పండరి పెదవుల్ని వంకరగావంచి నవ్వి "కిష్టానగరం యింటిగట్లాయిన కారాలూమిరియాలూ నూరతా వుండాడు. నిన్ను తొడుక్కోని రమ్మని ఆగిత్యం జేస్తావుండాడు" అన్నాడు.

"ఆ మనిషి యిచ్చిన మస్టరుదుడ్డుకు, నేను చేసిన పని సరిపొయ్యింది. యింక నేనాపక్కకు రావల్సిన పనిలేదు. మిగిలిన కరెంటుపని ముగించేసి, నీవల్లయినంత దుడ్డు నువ్వాడ బెరుక్కో..." అన్నాడు నంబి.

"రావల్సిందానికంటే చానాగానే వసూలుజేసుకున్నావు. నన్ను చిగిలించేసినావు..." సిగరెట్టు నోట్లో పెట్టుకున్నాక పండరి అగ్గిపెట్టెకోసం జేబులు తడుముకోసాగాడు. అగ్గిపుల్ల వెలిగించి సిగరెట్టుకంటించాక "జొరంగావుండాది రమ్మనిగదా చెప్పంపించినావు. తీరా అన్ని పన్లూ వదులుకోని నేనొస్తే గుండుమాదిరి గుచ్చోనుండావు. పైగా మద్దిస్తంలో సపోర్టుగా నన్ను రమ్మన్నానంటావుండావు. యిన్ని మాటల్లో నిజమేందో నువ్వేచెప్పు?" అని అడిగాడు.

"వొళ్ళు బాగలేందిగూడా నిజమేలే!" అంటూ నంబి నలిగిన దినపత్రిక కాగితాలు తిప్పసాగాడు. "అసలు బాగలేంది వొళ్ళుగాదు. మనుసు. యీ పొద్దీ మద్దిస్తమొకరకంగా తెగితేగానీ వొళ్ళుగూడా బాగుపడదు.."

హోటలు ముసలాయిన పాలగ్లాసును నంబిపక్కన వుంచాక, పండరికి టీగ్లాసు నందించాడు.

సిగరెట్టుపొగను రెండుచేతులతో దూరంగా విసిరికొడుతున్న నంబికేసి చూసి నవ్వేస్తూ" నువ్వు టీలు తాగవని యీ హోటలాయినకుగూడా తెలిసిపొయినట్లుండాది. నువ్వు వాడికగావచ్చే హోటలాయిది! మీ యింటికి బీగంతగిలించేసుండాది. నీ పెండ్లాంబిడ్డలు యాడికి పొయినారు?" అని అడిగాడు పండరి.

రెండువైపులా పొంగిపొర్లుతున్న మురికి కాలవల్ని ముందుకు నెడుతున్న యిండ్లవరసలమధ్య బారెడు వెడల్పున్న వీధి ముందుకుపోయేకొద్దీ సన్నబడిపోతోంది. వీధికి రెండువైపులా వుమ్మడిగోడలపైన కట్టిన యిండ్లు గూళ్ళూ, పుట్టలూ, పంజరాలూ, బోనులూ, కలగాపులగంగా కలిసిపోయి నిలబడినట్టుగా కనబడుతున్నాయి. యిటీవలే సిమెంటుపూత పూసుకున్న వీధి యిండ్లమధ్యలోకి పొంగుకొస్తున్నలావాలా కనబడుతోంది. యిండ్లలోపలినుంచీ టీవీల సవ్వడీ, పాత్రలు రాసుకుంటున్న శబ్దాలూ వినవస్తున్నాయి.

పదిబారలకవతల బీగం వేలాడుతున్న పూరింటికేసి ముఖంచిట్లించుకుని చూస్తూ "దిగవమల్లారంలో పెండ్లిచేసుకుంటే ముప్పయ్యి అంకణాల మిద్దిల్లు రాసిస్తామన్నారు. అప్పుడు నా బుద్ధి గాడిదలుగాసే దానికి పొయ్యింది. నా పెండ్లాం నాకు దెచ్చిచ్చింది ఆ పదైదంకణాల గుడిసిల్లు..." అన్నాడు నంబి.

పాలుతాగుతూ చేదుమింగుతున్న వాడిలా ముఖం పెడుతున్న నంబికేసి చూసి తన్మయంగా నవ్వుతూ "యీపొద్దు నీపనయి పొయ్యిందిలే ... అట్లాజూడు ... కిష్టానగరం యింటివోనరు పొరుమింద వస్తావుండాడు" అన్నాడు.

నిక్కరుమాత్రమే తొడుక్కున్న ఆరేళ్ళ కుర్రాడొకడు వూరకుక్క మెడకుదారం గట్టి వీధిలో లాక్కెళ్తున్నాడు. అయిసుబండిని తోసుకొస్తున్న మనిషి చెవులు చిల్లులుపడేలా గంట మోగిస్తున్నాడు. పాతబడి వంగిపోయిన వూతకర్రలాగున్న ముసలాయినొకడు టీ హోటలుముందు నిలబడి "పెద్దాయినా! ఆ పూరింటికి బీగమేసుండాది. ఆయింట్లోవుండే పురాతకం మనిషి యెట్ల బొయినాడో నీకేమైనా తెల్సునా?" అని అడిగాడు.

"నమస్కారం సా ... మేమిద్దురమూ యిక్కడ్నే వుండాము" ముందుగా సమాధానంచెప్పడంకోసం హోటలాయినతో పోటీ బడుతున్నట్టుగా పండరిగబగబా మాటల్ని ప్రసారం చేశాడు.

"నీకోసరమనే కాపెట్టుకోనుండానుసా ... లేకపొయ్యింటే యీ వేళకు రుయ్యాసుపత్రిలో వునుందుము" అన్నాడు నంబి వినయంగా తలముందుకువంచి.

"నేనొస్తావుండానని నీకెవురుచెప్పినారు?" ముసలాయిన గయ్యిమన్నాడు. నంబి వెలాతెలాబోతున్న పండరికేసి చేయి చాపాడు.

ముసలాయిన వాళ్ళిద్దరినీ మింగేసేలా చూస్తూ " యిద్దురి కిద్దురూ తోడుదొంగలలేలే! పిల్లికి యెలక సాక్షమా? ముందు యీపొద్దు మాయింటికి పనికెందుకు రాలేదో చెప్పండి.

మీరీ రకంగా నిర్వాకంజేస్తే మాయిల్లు గట్టేపని యెప్పటికి గడ్డన బడితిందో తేల్చి చెప్పండి. మీరీమాదిరిగా లేటుజేస్తావునిందానికని నేను నెలనెలా యెంత దుడ్డు అనావస్యంగా వడ్డీగా బ్యాంకీకి గడతావుండానో తెల్సునా?" అని హుంకరించాడు.

నంబి వినయంగా పైకిలేవబోయి అంతలో తూలిపడ్డాడు. "పదైద్దినాలుగా వొగటే జొరం సా .... టైపాయిడంట ... డాకట్టరు ఆస్పత్రిలో జేరమంటావుండాడు. కానీ వొప్పుకున్న పని ముగించే కావాల్లని నేను పట్టుబట్టినాను. యాపొద్దు తెల్లార్తోనే మనింటికాడికే యెలబారినాను. కానీ వొళ్ళు చెప్పిన మాటిన్లేదు. కండ్లు తిరిగి పడిపొయినాను. ఆస్పత్రికి తొడుక్కోని పొమ్మని పందరిని పిలవనంపించినాను. నువ్వింటికిపోసా ... మేమిద్దురూ రుయ్యాసుపత్రికిపొయ్యి, డాక్టరుకు చెప్పేసి, అక్కడ్నించీ అట్నే నేరుగా మనింటికే వచ్చేస్తాము..."

కళ్ళుతేలేసి నీరసంగా మాట్లాడుతున్న నంబిని చురచురాచూస్తూ "జొరంతో నువ్వొచ్చి మాయింటికాడ వుద్ధరించే దేముండాది?" అని వాపోయాడు యింటివోనరు.

"నిలబడే మాట్లాడతావుండావు. వచ్చి కుచ్చోసా ... టీ తాగుసా ..." పందరి మర్యాదలు మొదలు పెట్టాడు.

"ప్లంబరింగు యింక పట్టుమంటే పద్దినాలపనిగూడాలేదు సా..." నంబి తెచ్చికోలు దగ్గులు దగ్గుతూ చెప్పసాగాడు. " ఆ పద్దినాల్లో కరెంటుపనిగూడా ముగించేస్తా. కావాలంటే యింకో యిద్దురు పిల్లోళ్లను పనిలోకి దించతా... నీ పనికి పంచేటు చేస్తానాసార్ ... వొళ్ళు బాగలేకపొయ్యిందిగానీ లేకపోతే యీపాటికి..."

ముసలాయిన కోపంతో పళ్ళుకొరికి "యీపొద్దూరేపూ చూస్తాను. మొన్నాటికి పనిలోకి రాకపోతే కొత్తపనోళ్ళను మాట్లాడుకుంటాను" అన్నాడు.

"అంతపని జరగనిస్తానా సా... పనోడిగా నాకంతకంటే బొగిసానమింకేముండాది? నువ్వు పదసా... మాపిల్లోళ్ళను రేపే

## 2.

పనిలోకి తోలేస్తా..." దగ్గుతెర ముంచుకొస్తున్నట్టుగా నటిస్తూ నంబి ఆగిపోయాడు.

ముసలాయిన బుసలుగొడుతూ "అదీ చూస్తాను. యిదే లాస్టు వార్నింగు" అన్నాడు.

"సార్ ... దుడ్డుంటే యిన్నూరో మున్నూరో యిచ్చేసిపోసా... ఆస్పత్రి ఖర్చులకు గావాల్ల..." అంటూ నంబి దీనంగా అడిగాడు.

"పని ముగించినాకే యింకనీకు పేమెంటుచేసేది" ముసలాయిన జుబ్బా జేబును గట్టిగా పట్టుకుని వడివడిగా నడచివెళ్ళిపోయాడు.

పందరి సిగరెట్టు వెలిగించుకున్నాక చిరునవ్వు నవ్వాడు.

"వొకతూరి పన్లోకి యిరికించుకున్నాక కడదాంకా బండి లాగాల్సిందే! ముసిలోడు కొత్త పనోళ్లను పిలుచుకోనొచ్చుకుంటే యూనియన్లు గొమ్మునుంటాయా? అయినా ఆ మాదిరి యింకొకరి పనుల్లోకి దిగే పనోళ్ళెవురు? వాళ్లది గుండేనా, చెరువా?

నంబి హోటలాయినకేసి తిరిగి మాట్లాడుతున్నాడు. హోటలాయిన వదులుదుస్తులు తొడుక్కున్న పొట్టివాడొకడికీ, చాలీ చాలని దుస్తులు వేసుకున్న పొడుగువాడొకడికీ టీ కలిపి యిస్తున్నాడు.

ఆబగా సిగరెట్టును కాల్చేశాక, పీకను వీధి కాలవలోకి విసిరేయడం కోసం ముందుకొచ్చిన పండరి "అరరే! నువ్వా పెద్ద మేస్త్రీ మునిరత్నమన్నా! రారా! టీ తాగతావా?" అని పలకరించాడు.

పులిక్కిపడి ముందుకు వంగి చూసిన నంబి "రాన్నా! చానాదూరం వచ్చేసినావు" అంటూ పెదవుల్ని సాగదీశాడు.

మోపెడ్‌ను వీధిలో స్టాండువేసి నిలబెట్టాక మునిరత్నంరెడ్డి తలపైని గుడ్డటోపీని చేతికి తీసుకుంటూ టీ హోటలులోకి అడుగుబెట్టాడు.

"వొక టీ స్ట్రాంగ్గా... " అని అరిచాడు పండరి.

" యీ మాదిరి గొమ్ముగా యెట్ల కుర్చుంటారో మీరు నాకు తెలవదు... పైగా వొప్పుకున్న పని నెలలుగా పెండింగులో పడుండేటప్పుడు..." మునిరత్నంరెడ్డి కోపాన్నీ, నవ్వునూ కలగలిపాడు.

నీమాదిరి కయ్యా కాలవావుండే మగరాజుకైతే దుడ్డు లేకపొయినా జరిగితింది మేస్త్రీ! మాకుండేది చేతులూకాళ్ళే! చేసినపనికి మస్టరీకపోతే పనెట్ట చేస్తాము? పైగా పది పదైద్దినాలుగా జొరంలో పడుండేటప్పుడు..." నంబి వీలయినంత నీరసంగా చెప్పుకుపోయాడు.

పండరి తీసుకొచ్చిన టీగ్లాసునందుకుంటూ "అబద్దాలు చెప్పద్దురా! మస్టరుకంటే చానాగానే రూకలు వసూలుజేసుకునేసినావని ఆయింటి గల్లాయిన రంపుజేస్తావుండాడు..." అని అరిచాడు మునిరత్నంరెడ్డి.

"అప్పటికి నేను ముందొచ్చినానా? ఆయింటిగల్లాయిన ముందొచ్చినాడా? యెవురిమాట నమ్మతావునువ్వు?" నంబి బాధపడుతున్నట్టుగా ముఖం పెట్టుకున్నాడు. రెండుసార్లు నిట్టూర్చాక "కావాల్లంటే పండరినడుగు..." అని యెగదోసాడు.

"అవున్నా... కాదుకాదున్నా... నాకు తెలవదన్నా!" పండరి బెంబేలు పడ్డాడు.

"నా శిష్యులే యిట్టుండారన్నా!" నంబి మళ్లీ నిట్టూర్చాడు. "వాళ్ళు అడిగినప్పుడంతా దుడ్డిస్తావుండానని, నాకు గూడా వోనర్లు అదే మాదిరి మస్టర్లిస్తా వుండారని అనుకుంటారు. యింట్లోకి స్టోరుబియ్యం తేచ్చేసి నెలదినాలయ్యింది. పొయ్యిమీదికి యెసురెక్కితేగదా మనకు పనులపైకి మనసుబొయ్యేది! పైగా నాకు టైపాయిడ్ ... మందులకే యెనిమిదినూర్లదాంకా సెలవయ్యిది. యిన్ని కష్టాల్లో వుండిగూడా పనిలోకి పిలకాయిల్ని అంపిస్తానేవుండాను... యీ లోకంలో నా మాదిరి మంచోళ్లకు తావులేదు..."

పండరి యిచ్చిన సిగరెట్టును వెలిగించుకున్నాక మునిరత్నంరెడ్డి ప్రసన్నంగానవ్వి" ఆస్పత్రిలో కాపీ బెట్టించినావా?" అని అడిగాడు.

"నా బామ్మర్దిని అంపించినా... వాడు కాపీ కాగితం తీసుకోనొస్తానే నేను యెలబారతాను..."

మునిరత్నంరెడ్డి సిగరెట్టుపొగలో మైకం వస్తున్న వాడిలా తూలి "నీ బామ్మర్ది నిన్నుగాదని యింకేదో పెండ్లిజేసుకోని యిల్లొదిలిపెట్టి పొయినాడని చెప్పినావుగదా?" అని అడిగాడు.

నంబి తలగోక్కుంటూ "వాడు వేరే బామ్మర్ది ... వీడు మా తమ్ముడికి బామ్మర్ది... కొర్లగుంటలో సైకిలుషాపు పెట్టుకోనుండాడు..." అని నవ్వడానికి ప్రయత్నించాడు.

మునిరత్నంరెడ్డి చివాలున పైకిలేచి "నాకమీషనెప్పుడిస్తావు?" అని అడిగాడు.

నంబి విసుగ్గా ముఖమవతలికి తిప్పుకుని " యిప్పటికే చానా వసూలుజేసుకున్నావు. యింక అడగద్దన్నా! నాకు గిట్టదు" అన్నాడు.

వున్నట్టుండి దెయ్యమేదో తనపైకెక్కినట్టుగా మునిరత్నంరెడ్డి పెద్దగా వూగిపోతూ "పైకెక్కినాంక నిచ్చెన్ను తన్నేద్దామనుకుంటా వుండావేమో! వచ్చేనెలలో విద్యానగర్లో కొత్త యిల్లు వొప్పించుకోబోతావుండాను. పనిగావాల్లని ప్లంబర్లూ యెలక్ట్రికలోళ్లూ చుట్లాతిరగతావుండారు" అని అరిచాడు.

యెవరో చక్కిలిగింతలు పెడుతున్నట్టుగా నంబి వకవకానవ్వేసి "అన్నకెంతకోపమొస్తావుండాదో చూసినావా పండరీ! అందుకే పొయినవారమే దుడ్డిచ్చేయమన్నాను. .... నీకియ్యమని యిన్నూర్రూపాయలు వీనిచేతికిచ్చినాన్నా... వీడు యేందో అక్కరొచ్చిందని ఖర్చు బెట్టేసుకున్నాడు. నేనుండంగా పెద్ద మేస్త్రీ యింగొకడ్ని ప్లంబరుపనికి పిలవద్రా అని దెబ్బేసి చెప్పినాను... వీడు వినలేదు" అన్నాడు.

మునిరత్నంరెడ్డి మోపెడ్పైకెక్కి కూర్చుని "సాయింత్రంలోపల ఆ యిన్నూరూ నాకు చేరకపోతే నీకు విద్యానగర్ పనిరాదు. అద్దెలుసుకో!" అని గాండ్రించాడు. గుడుగుడుమని శబ్దంచేస్తూ మోపెడ్ అవతలివీధిలోకి తిరిగేశాక "నోరుతెరిస్తే అబద్దాలే! గోడబెట్టినట్టుగా అంత అతికినట్టుగా అబద్దాలెట్ల పుట్టిస్తావోనాకు తెలవాటంలేదన్నా! నాకు కండ్లు తిరగతావుండాది" అన్నాడు పండరి.

"అబద్దాలు మాట్లాడతానని యెగరేసి మాట్లాడేదిగాదు. పనోడు యెట్లా బతకాల్నో నేర్చుకో... పద్దినాలుగా వీళ్ళ పనికిపోలేదంటే యింట్లో గొమ్మునా గుచ్చున్నామనా అర్థం? వీళ్ళకు తెలియకుండా మనం వేరే పనులకొప్పుకోకుంటే సంపాదన సరిపోతిందా? తాసికలు మాసికలుగా బతకాల్సిందే గదా పనోడంటే! అయితే ఆ సంగతి వాళ్ళకు తెల్సిపోనీకుండా మాట్లాడేదిగూడా నేర్చుకోవాల..." నంబి ముఖం ముడుచుకునే చెప్పుకుపోయాడు.

నంబికేసి భయంభయంగా చూస్తూ "యింక పోతానయితే!" అంటూ పైకిలేచాడు పండరి.

" అంతగా అయితే వొగదినం కూలీ యిస్తాన్లే వుండు" వీలయినంతగా గొంతుతగ్గించి కసిరాడు నంబి. "యీపొద్దు మద్దిస్తమని గదా రమ్మన్నాను. నాపక్కమాట్లాడేదానికి వుండమన్నానని అంతబెట్టు జెయ్యద్దు... యెవురికైనా యెప్పుడోవొకప్పుడు అవసరం పడితింది..."

జీరంగిలా శబ్దంచేసుకుంటూ వచ్చిన మోటరుసైకిలొకటి టీహోటలుముందు ఆగింది. తెల్లటిపాంటుపైన మిలమిలలాడుతున్న ఖద్దరుచొక్కా తొడుక్కున్న యువకుడొకడు మోటరుసైకిలుస్టాండు వేసేశాక, నల్లటి కూలింగ్ గ్లాసుల్ని రుమాలుతో తుడుచుకుంటూ హోటలులోపలికొచ్చాడు. నంబిపైకిలేచి పలకరిస్తున్నట్టుగా నవ్వబోయాడు.

ఆగంతుకుడు బెంచీని దినపత్రికతో తుడిచేశాక, బట్టలు నలిగిపోకుండా జాగ్రత్తపడుతూ కూర్చున్నాడు. తరువాత ముభావంగా చుట్టూ చూసి "వుండావుగదా!..." అన్నాడు.

నంబి చేతులునలుపుకుంటూ "పద్దెద్దినాలుగా టైఫాయిడ్ అన్నా! రుయ్యాసుపత్రికి తొడుక్కోనిపొమ్మని శిష్యుడ్ని పిలవనంపించినాను. వీడొచ్చి చానా సేపయ్యింది. అయినా అన్న యిక్కడ్నే వుండమన్నాడని జెప్పినాడని తెలిసి యిట్నే వుండిపొయినాను.." అన్నాను.

ఖద్దరుచొక్కా యువకుడు దినపత్రికతో విసురుకుంటూ గవర్మెంటు పజ్జెనిమిదేళ్ళు రాంగానే వోట్లు మీ చేతల్లో పెడతావుండాది. యెంతటోడైనా మీచుట్టే తిరగాల్సిందేలే! వక్కాకుబెట్టి మద్దిస్తానికి పిలిస్తే గదా మీరు మాకు దొరికేది", అన్నాడు అదోలా నవ్వుతూ.

"అంతమాటనద్దన్నా!" నంబి వినయంగా వంగి లెంపలేసుకున్నాడు. "జొరంగావుండి కదల్లేక..." ఖద్దరు యువకుడు యెగతాళిగా నవ్వగానే నంబి మాట్లాడడం ఆపేశాడు. కాస్సేపు నసుగుసలుపోయాక "పొయినతడవ యెలక్షనల్లప్పుడు యీ యీధిబూతులో వోట్లన్నీ మనకే పడేట్టు కాపుగాసింది నేనేగదన్నా? కావాలంటే యెవుర్నయినా అడుగు..." అన్నాడు.

"అప్పుడు అన్న ఖర్చులకని యిచ్చనదాంట్లో నువ్వు కమీషనేమీ గొట్టలేదంటలే... నీ బామ్మర్ది ఆమాటే జెప్పినాడు."

"వాడు పచ్చిదొంగన్నా! వాడుచెప్పేటివన్నీ అబద్దాలే! నా సొత్తుతిని యిప్పుడు నాకే యెసురుబెడతావుండాడు. అయిదేండ్ల పిల్లోడుగావచ్చి మీసాలొచ్చే మొగోడయ్యేదాంకా నారెక్కల కష్టమే తిన్నాడు. నన్ను కాదని పొయినాక వానికీ నాకూ సంబంధమేముండాది? యిప్పుడు వాడు తిన్న సొత్తంతా కక్కేకావాల్ల! యిది నేను జెప్పేమాటగాదు. లోకమంతా జెప్పేమాట... కావాల్లంటే యీ వందరినడుగు.. ఆమాట చెప్పాలనే యిక్కడికొచ్చుండాడు..." యెదుటున్న వ్యక్తిపైన వినయమూ, తనను మోసంచేసినవ్యక్తిపైన కోపమూ పెనవేసుకుపోవడంతో నంబిమాటలు తూకం తప్పిపోయిన బరువుల్లా వూగిపోతున్నాయి.

"నీతో వచ్చినోడు నీమాటగాకుండా యింగొకరిమాట చెప్తాడా? వాడుగూడారానీ... వాడేంచెప్తాడో అదిగూడా విందాంగానీ..." టీ హోటలు ముసలాయిన వినయంగా అందించిన టీ గ్లాసును అన్యమనస్కంగా అందుకుంటూ ఖద్దరు యువకుడు తలవూపాడు.

"అన్నెప్పుడొస్తాడన్నా? అన్నతో గూడా యింగాయెవురెవురు వస్తావుండారు?" అని వినయంగా అడిగాడు నంబి.

"యీమాదిరి పనులకంతా రావాలంటే అన్నబిడువు చెడివుండాడా? యీమాత్రం పనిచేసేదానికి వూర్లోవుండే పెద్దమనుషులంతా రావాల్నా? నేను చాలదా?" అంటూ ఖద్దరు యువకుడు కసిరాడు.

వీధిలో శబ్దంచేయకుండావచ్చి ఆగిన మోటరుసైకిలుపైన్నుంచీ దిగుతూ "నమస్కారమన్నా! మాకంటే ముందుగా వచ్చేసినావు..." అని పలకరించాడొక యువకుడు. వెనక సీటుపైన్నుంచీ దిగిన యువకుడు సిగ్గుపడుతూ నమస్కరించాడు.

"నువ్వెప్పుడొచ్చినా జరిగితిందిరా వడివేలూ! నాకట్లాకుదరదే! అన్న యేడికి పొమ్మంటే అక్కడికిపోవాల. నీమాదిరి సొంత యాపారాలు నాకేడుండాయి? అన్న చెప్పిన పనులు చేసుకుంటా బతకమని నాకు రాసిపెట్టుండారు..." కోప్పడుతున్నాడో, ఆనందిస్తున్నాడో అర్థంగాని ధోరణిలో ఖద్దరు యువకుడు చెప్పుకుపోయాడు.

"నీ బామ్మర్ది దామోదరంగాడు ఆ కొత్త బావెనకాల కుక్కపిల్ల మాదిరిగా వస్తావుండాడు జూడు" అంటూ పందరి వేళాకోళమాడాడు.

లోపలికొచ్చి నంబికెదురుగావున్న బెంచీపైన కూచున్నాక "రారా దామోదరా! రా! యింతదూరం వచ్చినాంక యింక తటపటాయించాల్సిన పనిలేదు" అని పిలిచాడు వడివేలు తక్కుతూతారుతూ లోపలికొస్తున్న దామోదరాన్ని చూపించి నవ్వుతూ "వీడేన్నా నా బామ్మర్ది. యీకాలంలో పుట్టాల్సినోడుగాదన్నా! మట్టూ మర్యాదాజాస్తీ" అని పరిచయంచేశాడు వడివేలు..

"వీడునీగ్గూడా బామ్మర్దేగదా!" అని ఖద్దరయువకుడు నంబి నడిగాడు.

"వానికీనాకూ సంబంధం ఆపొద్దే తెగిపొయ్యిందన్నా!" అంటూ నంబి హుంకరించాడు.

టీ బైలరు నిప్పులనార్పేయడంతో హోటలులోపల పొగ సుళ్ళు తిరుగుతోంది. హోటలు ముసలాయిన ఖాళీ డబరాను పైకెత్తుకుంటున్నాడు.

"మావంతుకొచ్చేసరికి పాలుకూడా అయిపొయినట్లుండాయి" అన్నాడు వడివేలు దామోదరానికేసి చూసి కన్నుగీటుతూ.

"నీకూ వానికీ మధ్యలో సంబంధంతెగిపొయ్యిందంటావుండావు. యింగ మాట్లాడేదేముండాది? అందురూ పోదాం పదండి" ఖద్దరయువకుడు సరాయించాడు.

"సంబంధం తెగేపొయ్యింది. అయితే బాకీమాత్రం మిగిలుండాది..."నంబి టక్కున అడ్డుతగిలాడు.

"యేమి అప్పో, దేనికోసరంజేసిన అప్పో చెప్పమనన్నా!" వడివేలు అడిగాడు.

"చెప్పురా! యేమప్పో చెప్పు..." ఖద్దరుయువకుడు ప్రతిధ్వనిలా పలికాడు.

"నువ్వడగతావుండావని చెప్తావుండానన్నా! యింగోమనిషికెవుడికీ జబాబు చెప్పాల్సిన ఆగిత్యంలేదు నాకు..." ఆధారంకోసమన్నట్టుగా పందరి చేతిని గట్టిగాపట్టుకున్నాక నంబి చెప్పసాగాడు. "యీకష్టకాలంలో వొగమనిషిని అయిదేండ్లవయిస్సప్పటినించీ యిప్పటిదాంకా సాకేదంటే యెంత ఖర్చుయితిందో నీకు తెలవదా చెప్పన్నా! సమత్సరానికెంత లేదన్నా రెండువేలే లెక్కేసుకో... యీ యిరవయ్యేండ్లకూ యెంతయితిందో లెక్కబెట్టమను. ఆదుడ్డు నాకు పారేసి యేగంగలో అయినా దూకమను..."

ఖద్దరు యువకుడు యేమంటావన్నట్టుగా దామోదరంకేసి చేయివూపాడు.

"మూడునెలలుగా యీ రంపుపడలేకుండా వుండామన్నా! అందుకే మద్దిస్తంబెట్టి దీన్నేదోవొకరకంగా తెంపేయమని అన్నను అడుక్కున్నాను..." వడివేలుగొంతు సవరించుకున్నాడు. "సొయంగా పెండ్లాం తమ్ముణ్ణి యింట్లోబెట్టుకోని సాకేదాంట్లో కొత్తేముండాది? అయితే యెట్లసాకినాడో అదిగూడా అడిగిచూడు. యిస్కూలుముఖమైనా

చూపించినాడా? నిక్కర్లేసుకున్నప్పట్నించీ వానెనకాల్నే పనులకు తిప్పినాడు. వానికిచ్చిన కూలీ దుడ్డునుగూడా దిగమింగినాడు. వానికి సొంతచెల్లినిచ్చి పెండ్లిజేయాలనే యేరవతోనే యిద్దైనా చేసినాడు. వాడు వానిమాటినకుండా నా చెల్లిని చేసుకుంటానన్నాడని ఆగడంజేసి యింట్లోనించీ తరిమేసినాడు. నూటపదారూ నేనే ఖర్చుబెట్టుకోని పెండ్లి చేసినాను. న్యాయంగా లెక్కబెడితే వాని తిండికీ గుడ్డకూ సెలవుజేసిందానికంటే జాస్తీగానే కూలీదుడ్డు జవురుకున్నాడు. యింగా యేమప్పు మిగిలుండాదని రవాటిస్తావుండాడో నాకు తెలవదు..."

"యీధిలోవుండే మనుషులకు తెలియని సంగతులెన్నో వుంటాయన్నా! వానికి గవర్మెంటిల్లు తీసియ్యాలని పదైదువేలదాంకా ఖర్చుబెట్టుండాను. కావాల్లంటే యా పందరినడుగు" నంబి గొంతు జీరబోతోంది.

"గొమ్మునా గుచ్చునేదానికా నువ్వొచ్చింది? అడగాల్సింది బయింలేకుండా అడుగు" వడివేలు దామోదరాన్ని ముందుకు తోశాడు.

"నీకేం భయంలేదురా! నేనీడుండానుగదా! చెప్పు" ఖద్దరుయువకుడు అభయహస్తం చూపెట్టాడు.

దామోదరం లేచినిల్చుని, వెనక్కో అడుగేసి, "యింట్లో నాగ్గూడా భాగముండాదన్నా!" అంటూ నీళ్ళునమిలాడు.

"నీకా? భాగమా? యేయింట్లో?,,," నంబి వుగ్రమొచ్చినవాడిలా నిలువునా వూగిపోసాగాడు.

"అవునన్నా! ఆయింట్లో దామోదరానికి గూడా భాగముండాది. కావాల్లంటే వాళ్ళనాయిన్ను అడుగు" అంటూ వడివేలు దామూను మళ్లీ ముందుకు తోశాడు.

"వాళ్లనాయినా? ఆమనిషెవుడు? యెక్కడుండాడు?" ఖద్దరుయువకుడు చీకాకుపడుతూ అడిగాడు.

వడివేలు తల అటూయిటూతిప్పి, పెదవులు సాగదీసి పళ్ళన్నీ కనిపించేలా యికిలించి "యింతకుముందు ఖాళీ డబరా యెత్తుకోని పొయిన హోటలాయినేనన్నా..." అన్నాడు.

"ఆ మనిషా? వీనికినాయినా?... అయితే యిక్కడింత మద్దిస్తం జరగతావుంటే పట్టనట్టుగా యాడికి పొయినాడా మనిషి?" ఖద్దరు యువకుడు విసుగ్గా అరిచాడు.

"ఆ హోటలాయిన మీ మామా? ఆసంగతి చెప్పనేలేదే నాకు?..." పందరి విస్తుపోతూ నంబిని మింగేసేలా చూశాడు.

"ఆ మనిషికీ మాకూ సంబంధాలు తెగిపొయ్యి యిరవయ్యేండ్లయిపొయిందన్నా! యా తగరాటుకూ ఆయనకూ సంబంధంలేదు." నంబి చేతులూపుతూ బుసలుగొట్టాడు.

"అంత నిఖార్సుగా సంబంధాల్ని తెంచుకోనుంటే, దినమ్మూ హోటల్లో గుర్చోని లీటర్లు లీటర్లుగా పాలు తాగేదెందుకో చెప్పమనన్నా! అవసరంవుంటే వొకమాట, లేకపోతే యింకోమాటా, యిదేం న్యాయమో చెప్పమను..."

కొత్త గొంతుక వినిపించిన వైపుకు ఖద్దరుయువకుడు వులిక్కిపడి తిరిగిచూశాడు.. వీధిగోడపక్కనుంచి చెత్తకుండీలాగున్న లావుపాటి ఆడశరీరం ముందుకొచ్చింది.

ముఖంపైన కదలాడుతున్న తెల్లటి వెంట్రుకలతో, చేతులకూ జాకెట్టుకూ అంటుకున్న పసిడాగులతో, ఆవిడ వంటగదిలోంచీ సరాసరి వీధిలోకొచ్చినట్టుగా కనబడుతోంది.

ఆమె యెవరని అడుగుతున్నట్టుగా ఖద్దరు యువకుడు కనుబొమలతో సైగచేశాడు. నంబి పళ్లు కొరకసాగాడు. దామోదరం సిగ్గుపడసాగాడు. పండరి బిక్కమొగం పెట్టాడు. వడివేలు పెదవులు కోపంతో వణుకుతున్నాయి.

"యీ హోటలు మాదే నాయినా!" ఆవిడే మొదలుబెట్టింది. "ఆయిన్ను జూసినావు గదా! మావోళ్ళు వొయిసులో పెద్దోడనిగూడా తలంచకుండా, రెండోపెండ్లనిగూడా జూడకుండా, నన్నీ కొంపలోకి తోసినారు. వస్తానే సవితికూతురికి పెండ్లిజేసినాన్నేను. అల్లుడని జెప్పే యీ మనిషి, తొలీభార్య భాగమనే పేరుతో ఆయిల్లు వరతట్టుకునేదానికోసరం ఆ మొగబిడ్డనుగూడా బలంతంగా లాక్కున్నాడు. వాళ్ళిద్దర్నీ వాళ్ళనాయినకు గానీకుండా జేసినాడు. నేనూ నా మొగుడూ తట్టాబుట్టా యెత్తుకోని బాడిగింటికి పొయినాం. అయితే యీమనిషి దినమ్మూ జబర్దస్తీగా హోటల్లోకొచ్చి కూర్చోని గ్లానులుగ్లానులుగా పాలుతాగిపోతానే వుండాడు. బింగను బింకంగా మాటాపలుకూలేవుగానీ దర్బారుకుమాత్రం తక్కవలేదు. ఆపిల్లోడు యీ మనిషి మాటినకుండావేరేపెండ్లి చేసుకున్న దినంనుంచీ మామింద యెగిరిదూకతావుండాడు. మేముండేది అడివో వూరో తెలవాటంలేదు. యిదేం న్యాయంరా అని అడిగే దిక్కులేదు..."

ఖద్దరుయువకుడి జేబులోంచీ నల్లటి నిగనిగల సెల్‌ఫోను రంగురంగుల్లో వెలుగుతూ సంగీతాన్ని విరజిమ్మింది. ఖద్దరుయువకుడు కాస్సేపు సెల్లుతో రహస్యంగా మంతనాలు చేశాడు. తర్వాత "నాకు పనుండాదిరా వడివేలా! యీకతేందో మహాభారతమంతుండాది. దీనికి మొదులేడనో, ఆకిరేడ్నో నాకు తెలవాటంలేదు. బిన్నాగా యేదో వొగటి వొగదెంచు, నేను పోవాల్ల" అన్నాడు.

వడివేలు తెచ్చికోలు నవ్వులునవ్వి "ఆమె మాటలింటివి గదన్నా! అది తొలీభార్య భాగానికొచ్చిన యిల్లు. ఆడబిడ్డకుగూడా సగభాగమని నేను న్యాయంగానే పోతాను. మగపిల్లోనికియ్యాల్సిన సగభాగం వీనికిచ్చెయ్యాల్సిందే! ఆయింట్లో చెరీసగానికి గోడలుపెట్టాల్సిందే..." అన్నాడు.

"నేనొప్పుకోను... " నంబి కాలుతున్న పెనంపైన కూర్చున్నవాడిలా కదంతొక్కసాగాడు. "సాకిందానికి యెంత ఖర్చుబెట్టినాను? అదక్కడ కక్కమను..."

ఖద్దరు యువకుడు అందరినీ కళ్ళు చికిలించుకుని చూశాక "రేయ్ వూరికే ఆగిత్యం జెయ్యొద్దు. వాడు సంపాయించి యిచ్చిందానికీ, వాన్ని సాకిన ఖర్చుకూ సరేపొయ్యుంటాది. యిప్పుడు న్యాయింగా వానికి సగం యిల్లు యిచ్చెయ్యి. నామాటయినను..." అని కసిరాడు.

"నువ్వుచెపితే వొకటీ, పెద్దన్న చెప్తే వొకటా అన్నా! నీమాట నేనెప్పుడు కాదన్నాను జెప్పు..." వడివేలు ఆనందంగా తలవూపాడు.

నంబి కోపంతో గసలుబోస్తూ కాస్సేపు మౌనంగావుండిపోయాడు. తరువాత పెద్దగా నిట్టూర్చి "కొత్తగావచ్చి నోళ్లని నెత్తికెక్కించుకోనుండావు. చానాకాలంగా నీకు వత్తాసు

చెప్పినోళ్లను దిగ్గొలికేది న్యాయం గాదన్నా! నువ్వెందుకింత వలపక్షంగా మాట్లాడతావుండావో నాకు తెలుసు..." అన్నాడు.

ఖద్దరు యువకుడు విసుగ్గా వురిమిచూశాడు.

"పొయిన తడవ పోలింగప్పుడు యీ యీధిలో వొకవోటుగూడా బీరుపోకుండా అన్నకే పడిందెందుకో తెల్సునా? అన్న కోసరమని ఆపదిరవై దినాలూ రాత్రనకా పగులనకా, కూలీ పనులుగూడా యిడిసిపెట్టి తిరిగిందెవురో మర్చిపొయినావా? అన్న జెప్పినాడని పసుపు చొక్కాలు లేకుండా యీధిలోకి రానిదెవురో గెవనముండాదా?" నంబి వుక్రోషంతో గొంతు చించుకోసాగాడు.

"అయితే యిప్పుడుగూడా అదే చొక్కాలనే యేసుకోమను..." వడివేలు వెక్కసంగా నవ్వేశాడు. "అన్న ఆ పార్టీని యిడిసిపెట్టింది గూడా తెలవదు... యిప్పుడన్న తెల్లచొక్కాయేసుకుంటా వుండాడు..."

"ష్... గొమ్మునుండురా!" ఖద్దరు యువకుడు కసిరాడు. "కొన్నిదినాలదాంకా గొమ్మునుండు. అన్న యిప్పుడు వేరే పార్టీలోకి దూరాలని చూస్తావుండాడు..."

కాస్సేపు అయోమయంగా చూశాక "దాంతో నాకనావస్యమన్నా! అన్నే పార్టీలోవుంటే నాకేల? అన్నేంజెయ్యమంటాడో అది జరిగేతీరాల్ల... దానికి నాదీ హామీ!" అని చిన్న పిల్లాడిలా వడివేలు కేరింతలు గొట్టాడు.

"మాయీధిలోకంటే వాళ్ళీధిలో వోట్లు చానావుండాయని వానిమాట మాట్లాడద్దన్నా! వాళ్ళువాని మాట యింటారాలేదా అనిచూడు. ఆదగుల్బాజీగాడు నాసొత్తు తినేసిపొయినాడు. నన్ను ముంచేసిపొయినాడు. నాకన్యాయంజేసినాడు. నువ్వు వాని మాట మాట్లాడేది అన్యాయం..." నంబి గొల్లుమని అరవసాగాడు.

ఖద్దరు యువకుడు అతడిమాటలు వినబడనట్టుగా పైకిలేచి నిలబడ్డాడు. రుమాలుతో నల్లకళ్లజోడు తుడుచుకుంటూ తలతిప్పి "యిదేందిరా? యిక్కడేదో పాతకంభంవుండాది.... యిదేమైనా గుడా?" అని యధాలాపంగా ప్రశ్నించాడు.

వడివేలు గోడలో కలిసిపోయిన పాతరాతిస్థంభం దగ్గరికెళ్ళి నిల్చుని "ఆపక్క పట్నాలు వీధిలో పాత సత్రముండాది గదన్నా! యిదిగూడా వాళ్ళతావే! సత్రమోల్లు పాతమండపాల్లో గోడలుగట్టి అంగిళ్ళకు బాడిగకిచ్చుండారు..." అన్నాడు.

ఖద్దరుయువకుడు రెండడుగులు ముందుకేసి "ఆపాతఫోటోలుతీసి పారేసి, సున్నలుగొట్టిస్తే జమ్మనుంటాది. కావాల్లంటే ముందొక గోడగట్టుకుంటే ఆఫీసుకు జమ్మనుంటాది.... కొత్త పార్టీకి యీపక్క ఆఫీసుగావాలంటా వుండాడు అన్న..." అన్నాడు.

"యిదన్యాయమన్నా? నాకు నా అప్పుగట్టేతీరాల్ల..."

యీసారిగూడా నంబి మాటలు చెవిన బడనట్టుగా ఖద్దరు యువకుడు మోటరు సైకిలు స్టార్టుచేశాడు.

"బామ్మర్దీ! పనయ్యింది గదా! పోదామా?" అంటూ వడివేలు పరిగెడుతున్న మోటరు సైకిలుకు నమస్కారంజేశాడు. "యింకనీకేం బయింలేదు. రేపొద్దనకంతా

మనుషుల్ని పనిలోకి దింపేస్తాను. రెండంటే రెండేదినాల్లో గోడలేపేస్తాను. నువ్వు యేకంగా యాడ్నే కొత్త కాపరం పెట్టుకోవచ్చు..." వరండాలోవున్న మనుషులెవరూ తనకు కనబడనట్లుగా పడివేలు చూపుల్ని గాల్లోకి మరల్చాడు. "అన్న చెప్పినాడు గదా! యింక అదేరూలు... పోదాం పద..." అంటూ మోటరు సైకిలు స్టార్టు చేశాడు. దామోదరం ముఖమటుతిప్పుకుని వెనకసీటుపైన కూర్చున్నాడు.

శబ్దం చేయకుండా జెర్రిపోతులా జారుకున్న మోటరుసైకిలును వింతగా చూస్తూ సైకిలేచి నిల్చున్నాడు పండరి. తర్వాత అటూ యిటూ చూసి" ఆ ఆడమనిషి -అదేలే మీ చిన్నత్త - యెప్పుడు వుడీసయ్యిందో తెలవనేలేదు. సరిగ్గా టయానికొచ్చి, చెయ్యాల్సినపని చేసేసిపొయ్యింది..." అన్నాడు.

"ఆమెకు నాసంగతి తెలవదు. చూస్తావుండు. అన్నకు యీతావుపైన కండ్లు పడినాయి. దీన్ని వాళ్ళకు దక్కనీకుండా చెయ్యకపోతే నాపేరు మార్చిపెట్టు... ఆగోడపైన పెద్దన్న ఫోటోను తగిలించకపోతే అప్పుడడుగు..." నంబి యింకా వుక్రోషంతో బుసలుగొడుతున్నాడు.

"వురుము వురిమి వురిమీ వుడుంపైన పడిందంట. ఆ మాదిరుండాది నీ తెలివి? నీకంత ధైర్యమేవుంటే ఆ వడివేలుగానిపైన చూపించు నీ ప్రతాపం? లేకపోతే దామోదరంగాడ్ని యిదిలించి చూడు. అయినా యీ మాదిరి న్యాయం చెప్పేదానికా అన్నెవుడు?" కావాల్లంటే పోలీసుల్దెగ్గిరికిపో!" పండరికి కూడా యీసారికోపమొచ్చింది.

నంబి అతడిమాటలు వినబడనట్టుగా ముఖం పక్కకుతిప్పి "యీసారి పక్కీధిని గూడా పిడికిట్లో పెట్టుకోవాల. లేకపోతే అన్న దగ్గిర మనమాట జరగదు..." అని దీనంగా వాపోయాడు.

రెండు నిముషాలు ఆలోచించాక పండరి వెలవెలబోతున్న నవ్వునవ్వి "ఆసరికి మీ పెద్దన్న యింకోపార్టీకి మారిపోతాడేమో..." అని వేళాకోళమాడాడు.

**చినుకు, ఏప్రిల్ 2009**